క్లుప్తంగా

పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టాలి



పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం టౌన్: పట్టణంలో పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి పనిచేస్తే సహకరిస్తానని, లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 30 వార్డుల నుంచి పారిశుద్ధ్యానికి సంబంధించి ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని సరిదిద్దుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్ అధికాలు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించాలి



బర్లి యూపీ పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

బలిజిపేట: ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈఓ-1 సామల సింహాచలం సూచించారు. మండలంలోని బర్లి ప్రాథమికోన్నత, వెంగాపురం ప్రాథమిక పాఠశాలలను సోమవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నోట్ బుక్స్, వర్క్‌బుక్స్‌ను పరిశీలించారు. చేతిరాతను అందంగా తీర్చిదిద్దుకునేందుకు అవసరమైన సూచనలు చేశారు. బోర్డుపై అక్షరాలు రాసి వాటిని విద్యార్థులతో చదివించారు. అకడమిక్ పుస్తకాల ప్రకారం విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంపొందించేందుకు కృషి చేయాలని, మధ్యాహ్న భోజనంలో మంచి పోషకాహారాన్ని అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించారు.

మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి చర్యలు

పార్వతీపురం టౌన్: మాజీ సైనికులు, వారి కుటుంబాల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు, సలహాలు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సైనిక సంక్షేమాధికారి ఎం.కృష్ణారావు సోమవారం ఓ ప్రకటనలో కోరారు. మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యుల సమస్యల సత్వర పరిష్కారానికి వచ్చే నెల మొదటివారంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా సైకిక్ బోర్డు సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు వారి సూచనలు, సలహాలను ఈ నెల 31లోగా జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం, విజయనగరం వారికి అందజేయాలని కోరారు. లిఖితపూర్వకంగా గానీ, 8688817946 నంబరుకు వాట్సాప్, జెడ్ఎస్‌డబ్ల్యూఓవీజెడ్ ఎం జీ మెయిల్ చేయవచ్చని తెలిపారు.

గెడ్డలుప్పి-కొత్తవలస బీటీరోడ్డు పనులకు శంకుస్థాపన

సీతానగరం: గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే బి.విజయచంద్ర అన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా బగ్గందొరవలస జంక్షన్ నుంచి గెడ్డలుప్పి మీదుగా కొత్తవలస వరకు రూ.2.5 కోట్లతో 3.1 కిలోమీటర్ల మేర బీటీరోడ్డు నిర్మాణానికి స్థానిక సర్పంచ్ అల్లు తిరుపతిరావుతో కలిసి సోమవారం శిలాఫలకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు సామాజికపరమైన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. రోడ్డు నిర్మాణ పనులను సంక్రాంతిలోగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. వచ్చే ఐదేళ్లలో రూ.2 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ త్రివిక్రమరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ ఉమా మహేశ్వరరావు, వెలుగు ఏపీఎం శ్రీరాములు, ఏపీఓ భాను, మండల ఇంజినీరింగ్ అధికారులు చంద్రమౌళి, పీఆర్ ప్రాజెక్ట్ ఏఈ రమా, మండల టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు పి.సత్యంనాయుడు, ఆర్.వేణు, గాజాపు తాతబాబు, కె.శ్రీరాములు, సీహెచ్ సింహాచలం, బగ్గందొరవలస, గెడ్డలుప్పి సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కొండను ముద్దాడిన నింగి..



మన్యంపై మనసు పారేసుకున్నట్లు మేఘాలు ఇలా చెంతకు చేరాయి. పసుపుపచ్చని కోక చుట్టినట్లు ఉన్న పుడమి తల్లిని చూసి పులకించిన నీలిమేఘాలు లయబద్ధంగా ఊగిసలాడుతూ పంటచేలను తాకేందుకు దిగివచ్చాయి. మండలంలోని గుడివాడ వద్ద సోమవారం సాయంత్రం వేళ చిరు జల్లులు కురవడంతో వాతావరణంలో చల్లదనం అలముకోగా.. మేఘాలు చేతికందినంత దిగువకు వచ్చి కొండను ముద్దాడినట్లు కనిపించింది.

– పాలకొండ రూరల్

అన్నదాతకు అకాల కష్టం



- గాలివానకు నేలకొరిగిన వరిచేలు
- పత్తిపంట వర్షార్పణం
- లబోదిబోమంటున్న రైతులు

సాలూరు రూరల్:

మండలంలో ఆదివారం కురిసిన గాలివానకు పలు గ్రామాల్లో వరిచేలు నేలకొరిగాయి. మరి కొద్ది రోజుల్లో పంట చేతికొస్తుందని ఆశపడ్డ అన్నదాతకు నిరాశే మిగిలింది. కూర్మరాజుపేట, కందులపదం పంచాయతీ చింతలవలస, కొట్టుపరువు పంచాయతీ డి.వెలగవలస, తదితర గ్రామాల్లో వరిచేలు కొంతమేర నేలకొరిగాయి. చింతలవలస గ్రామంలో వెంకటేశ్వరారావు అనే రైతుకు చెందిన ఒకటిన్నర ఎకరాల వరిపంట, కొండతామర గంగరాజుకు చెందిన అర ఎకరం వరిపంట పూర్తిగా నేలమట్టమైంది. డి.వెలగవలసలో సింహాచలం అనే రైతుకు చెందిన రెండు ఎకరాలు, కూర్మరాజుపేటలో సుమారు రెండు ఎకరాల వరిచేను నేలకొరిగింది. కోతకొచ్చిన పంట నీటిపాలవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పంట నష్టాలను అంచనా వేయడంలో వ్యవసాయశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. నష్టపోయిన పంటలను పరిశీలించేందుకు వ్యవసాయ సిబ్బంది రాకపోవడంతో రైతులే రైతు సేవా కేంద్రాలకు వెళ్లి తమ కష్టాన్ని చెప్పుకుందామన్నా అక్కడ కూడా సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఏమి చేయాలో తెలియక ఆందోళన చెందుతున్నారు.

పత్తి దిగుబడి, నాణ్యతపై ప్రభావం



కుళ్లిపోయిన పత్తికాయలను చూపిస్తున్న రైతు

మరోవైపు ఈ వర్షం పత్తిరైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. పూతదశకు చేరుకున్న పత్తికాయలు కుళ్లిపోవడంతో నాణ్యమైన దిగుబడి రాక నష్టపోయారు. నాణ్యత తగ్గడంతో మార్కెట్లో తక్కువ ధర పలుకుతుందని వాపోతున్నారు. పంట నష్టాన్ని అంచనా వేసే క్రమంలో పత్తి దిగుబడి, నాణ్యతను వ్యవసాయ శాఖ అధికారులు పరిగణలోకి తీసుకోవాలని కోరుతున్నారు. పంట నీటమునగడం, నేల కొరగడం మాత్రమే నష్టం కాదని, వాతావరణం అనుకూలించక దిగుబడి తగ్గిన పంటలను కూడా పంటనష్టాల జాబితాలో చేర్చాలని అంటున్నారు.

పరిహారం అందించి ఆదుకోవాలి



రెండు ఎకరాల్లో వరిసాగు చేస్తున్నాను. మొన్నటివరకు పంట బాగానే ఉండటంతో దిగుబడి బాగా వస్తుందని ఆశపడ్డాను. ఆదివారం రాత్రి కురిసిన గాలివానకు పంట పూర్తిగా నేలమట్టమయ్యింది. వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టాన్ని పరిశీలించి పరిహారం అందించాలని కోరుకుంటున్నాను. – సింహచలం, రైతు, డి.వెలగవలస

అప్పుచేసి మదుపు పెట్టాను

ఉన్న అర ఎకరా భూమిలో వరిసాగు వేశాను. పంట చేతికి వస్తుందని ఆశపడ్డాను. ఒక్క రాత్రిలో అంతా మారిపోయింది. గాలివానకు పంట నేలకొరిగడంతో పూర్తిగా నష్టపోయాను. పంట కోసం రూ.15 వేలు అప్పు చేసి మదుపులు పెట్టాను. అప్పు తీర్చేందుకు నా వద్ద ఒక్క పైసా కూడా లేదు. గత ప్రభుత్వంలో కనీసం రైతుభరోసా అయినా వచ్చేది. ఇప్పుడు అది కూడా లేదు. ప్రభుత్వమే నన్ను ఆదుకోవాలి.

– కొండతామర గంగరాజు, రైతు, చింతలవలస

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



ఫైలేరియా బాధితులతో మాట్లాడుతున్న నోడల్ అధికారి వినోద్

బలిజిపేట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను నివారించడంతో పాటు వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ నోడల్ అధికారి వినోద్ అన్నారు. మండలంలోని పెదపెంకి గ్రామాన్ని సోమవారం ఆయన సందర్శించారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. ఫైలేరియా బాధితులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు. పరిసరాల పరిశుభ్రత, తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. గ్రామంలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశించారు. ఆయన వెంట సర్పంచ్ పాపారావు, బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారి క్రాంతి కిరణ్మయి, ఎంపీడీఓ విజయలక్ష్మి ఉన్నారు.

ప్రజాప్రతినిధులకు విలువివ్వని అధికారులు



గ్రామసభలో ఏపీఓ రామకృష్ణ, వైస్ ఎంపీపీ సురేష్ (ఫైల్)

సాలూరు రూరల్: ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన స్థానిక ప్రజాప్రతినిధులకు అధికారులు ఎంతటి విలువ ఇస్తున్నారో తెలిపేందుకు సాలూరు ఏపీఓ రామక్రిష్ణ వ్యవహరిస్తున్న తీరే నిలువెత్తు నిదర్శనంగా చెప్పవచ్చు. కూటమి ప్రభుత్వం గత నెలలో గ్రామసభలు నిర్వహించి గ్రామాల్లో ప్రజల నుంచి వినతులు స్వీకరించింది. అయితే మండలానికి 19 గోశాలలు మంజూరు కాగా, మరో 6 గోశాలలు అదనంగా మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు. వాటిని మామిడిపల్లి, పెదపదం, శివరాంపురం, కొత్తవలస పంచాయితీలకు కేటాయించారని, గ్రామసభల రిజిష్టర్లలో ఆగస్టు 23న నమోదు చేయాలని సెక్రటరీలకు గ్రూపులో ఏపీఓ వాయిస్ మెసేజ్ పెట్టారు. ఈ ఆదేశాలు పీడీ ఇచ్చారని, ఆయన ఆదేశాల ప్రకారం సర్పంచ్‌ల తీర్మానాలు అవసరం లేకుండా ఈ ఆరు పేర్లు చేర్చాలని మెసేజ్‌లో పేర్కొన్నారు. మండలంలో మూడు పంచాయతీలు మినహా అన్ని పంచాయతీల్లో వైఎస్సార్ సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారంలో ఉన్నారు. ఇప్పటికే పంచాయతీల్లో నిర్వహించే అధికారిక కార్యక్రమాలకు సబంధించి వారికి అధికారుల నుంచి వారికి ఎటువంటి సమాచారం అందడం లేదు. దీనిపై వారంతా పలుమార్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయినా అధికారుల తీరులో ఏ మాత్రం మార్పు రాలేదు.

కార్యకర్తలకు కేటాయించేందుకే..

గోశాలలును కూటమి పార్టీల కార్యకర్తలకు కేటాయించేందుకు చూస్తున్నారు. అందుకే ప్రత్యేకంగా సర్పంచ్‌లు తీర్మానాలు అవసరం లేకుండా పాత తేదీలతో వాటిని రిజిస్టర్లలో నమోదు చేయమంటున్నారు. పీడీ చెప్పారని ఏపీఓ రామకృష్ణ నచ్చినట్లు వ్యవహరిస్తున్నారు. సెక్రటరీలకు వాయిస్ మెసేజ్ పెట్టి పాత తేదీతో ఎంటర్ చేయమని చెప్పడం దారుణం. ఇలా అయితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం. ఇప్పటికే గ్రామసభల్లో ఎన్నికైన ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం లేకుండా చూస్తున్నారు. ఇలాగే కొనసాగితే అధికారులే ఇబ్బందులు ఎదుర్కొంటారు. – రెడ్డి సురేష్, వైస్ ఎంపీపీ

బదిలీ ఉత్తర్వులు అమలు చేయాలని డిమాండ్

పార్వతీపురం: పాలకొండ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సచివాలయ కార్యదర్శులకు బదిలీ ఉత్తర్వులు జారీచేసినప్పటికీ ఇంతవరకు రిలీవింగ్, జాయింగ్ ఆర్డర్స్ ఇవ్వని ఎంపీడీఓలపై తక్షణం చర్యలు తీసుకోవాలని గిరిజన ప్రజా సమాఖ్య సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం గిరిజన సంఘ నాయకులు మాట్లాడుతూ బదిలీ ఉత్తర్వులు జిల్లా కలెక్టర్ ఇచ్చినప్పటికీ స్థానిక ప్రజాప్రతినిధుల ఆదేశాల మేరకు వాటిని అమలు చేయడం లేదన్నా రు. దీంతో సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు నెల వారీ జీతభత్యాలు పొందేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బదిలీ అయిన ప్రదేశంలో పనిచేయాలో లేక ప్రస్తుతం పనిచేస్తున్న సచివాలయంలో నే విధులు నిర్వహించాలో తెలియని సందిగ్ధ పరిస్థితి నెలకొందన్నారు. బదిలీ ఉత్తర్వులను అమలు చేసేలా అవసరమైన చర్యలను చేపట్టాలని కోరారు.

బొడ్డపాడు జీపీఎస్ పాఠశాలను తెరిపించాలి



ఎంఈఓ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు

సాలూరు: మండలంలో మూసివేసిన బొడ్డపాడు జీపీఎస్ పాఠశాలను వెంటనే తెరిపించి గిరిజన విద్యార్థులకు విద్యను అందించాలని గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సీదరపు అప్పారావు, గిరిజనులు డిమాండ్ చేశారు. ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ జీపీఎస్ పాఠశాలను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మూసివేయడంతో గిరిజన విద్యార్థులు చదువుకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలను వెంటనే తెరిపించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకుంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంఈఓ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సుందరరావు, జానకిరావు, తమ్మయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోడుపట్టాలు మంజూరు చేయాలని డిమాండ్



తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించిన సీపీఎం నాయకులు, గిరిజనులు

పార్వతీపురంటౌన్: అటవీ భూములకు పోడు పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సుందరయ్య భవనం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలాయం వద్ద బైఠాయించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముండలంలోని తానవలస, సీతంపేట, తోకుడువలస, పనసభద్ర, లచ్చన్నదొరవలస, వెలగవలస, సందివలస, ముగడవలస, వెలగవలస, డోకిశీల, బుదురువాడ, గంగాపురం, ములగ, సంగంవలస పంచాయతీల పరిధిలో ఏళ్ల తరబడి కొండను చదునుచేసి పోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులకు ఇంతవరకు పోడుపట్టాలు మంజూరు చేయలేదన్నారు. పోడుపట్టాలు మంజూరు కోరుతూ అనేకమార్లు జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులకు వినతులు అందజేసినా కనీస స్పందన లేదని వాపోయారు. చూస్తాం, చేస్తామని చెపుతూ అధికారులు కాలం గడుపుతూ గిరిజనులు మోసగిస్తున్నారని మండిపడ్డారు. కొంతమంది పెత్తందారులు తప్పుడు పత్రాలు సృష్టించి గిరిజనుల భూములు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా రెవెన్యూ యంత్రాంగం స్పందించి గిరిజనులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేందటే గిరిజనుల తరఫున దశలవారీగా పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు, పట్టణ కార్యదర్శి జి.వెంకటరమణ, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, రావికోన సర్పంచ్ కె.రామస్వామి, మండల నాయకులు పి.రాము, గిరిజన నాయకులు డి.రాము, గిరిజన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో గిరిజన వర్సిటీ ఏర్పాటు చేయాలి



సమావేశంలో పాల్గొన్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్ బాబు

పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రంలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్‌బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి జూనియర్ కళాశాల మైదనాం వరకు విద్యార్థులతో కలిసి సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పేద, బడుగు, బలహీనవర్గ విద్యార్థులు ఎక్కువ మంది ఉన్నారని, వారంతా ఉన్నత విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. జిల్లాలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతంలో ఉన్న పేద విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. అలాగే జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో గిరిజన విద్యార్థుల మృతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విద్య వ్యతిరేక విధానాలపై ఏఐఎస్ఎఫ్ నిరంతర పోరాటం సాగిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగభూషణం, రాష్ట్ర సమితి సభ్యుడు రవికుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్మథరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవి పాల్గొన్నారు.

పేద విద్యార్థులపై ఫీజుల భారం

- విద్యా సంబంధిత పథకాల ఊసెత్తని కూటమి సర్కార్
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై రాని స్పష్టత
- ఫీజులు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్న కళాశాలలు
- పరీక్షలు రాయనీయమని బెదిరింపులు
- గత ప్రభుత్వంలో క్రమం తప్పకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్



గత ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెక్కును అందజేస్తున్న అధికారులు(ఫైల్)

పార్వతీపురం టౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనప్పటికీ విద్యా పథకాల ఊసెత్తడం లేదు. ముఖ్యంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలుపై నేటికీ స్పష్టత రాకపోవడంతో ఉన్నత విద్య అభ్యసిస్తున్న పేద, మధ్యతరగతి విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ముఖ్యంగా ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నాయి. కళాశాలల నిర్వహణ భారంగా మారిందనే కారణంతో ఫీజులు కట్టకపోతే పరీక్షలు రాయనీయమని పరోక్షంగా సందేశాలు ఇస్తున్నాయి. ఫీజులు చెల్లించలేక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో వివిధ కళాశాలల్లో 22,584 మంది విద్యార్థులు వసతి గృహాల్లో ఉంటూ వివిధ కోర్సులు అభ్యసిస్తున్నారు.

పథకాల ఊసెత్తని కూటమి సర్కార్

కూటమి ప్రభుత్వంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. పరిస్థితులు అందుకు భిన్నంగా కనబడుతున్నాయి. వచ్చే నవంబరు, డిసెంబరు నెలల్లో సెమిస్టర్ ఎగ్జామ్స్ ఉండటం వల్ల పరీక్ష ఫీజు రుసుమును ఆయా యాజమాన్యాలు కట్టించుకోవడం నిలుపుదల చేశాయి. రీయింబర్స్‌మెంట్ పథకంపై ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పష్టత లేకపోవడంతో పరీక్ష ఫీజు కట్టించుకోవాలంటే ట్యూషన్ ఫీజు కచ్చితంగా చెల్లించాల్సిందే అంటూ ఒత్తిళ్లు చేస్తున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులుచేసి ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని పేద విద్యార్థులతో పాటు వారు తల్లిదండ్రులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

జిల్లాలో విద్యార్థులకు చేకూరాల్సిన లబ్ధి

కేటగిరి	విద్యార్థులు	అవసరమైన నిధులు (రూ.కోట్లలో)
బీసీ వెల్ఫేర్	14,068	రూ. 22.96
ట్రైబల్ వెల్ఫేర్	4,878	రూ. 5.74
సోషల్ వెల్ఫేర్	2,718	రూ. 4.51
ఈబీసీ	671	రూ. 1.32
కాపు	209	రూ. 0.46
ముస్లిం	30	రూ. 0.06
క్రిస్టియన్	10	రూ. 0.03
మొత్తం	22,584	రూ. 35.08

గాల్లో విద్యార్థుల భవిష్యత్తు



విద్యా సంవత్సరం ప్రారంభించి నేటికి నెలలు కావస్తోంది. నూతన ప్రభుత్వం ఏర్పాటై దాదాపు 5 నెలలు అవుతోంది. మరో రెండు నెలలో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో కళాశాలలో చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై స్పష్టత లేకపోవడం విద్యార్థులపై ఆర్థిక భారం పడుతుంది. వారి భవిష్యత్ గాల్లో పెట్టిన దీపంలా మారింది.

– బి.రవి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి, పార్వతీపురం మన్యం

ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలి



ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలి. మొదటి విడత ఫీజును ఇప్పటివరకు చెల్లించకపోవడంతో విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. డిగ్రీ, ఇంజినీరింగ్ వంటి ఉన్నత చదువులపై ఆశలు పెట్టుకున్న వారంతా ఇప్పుడు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నాలుగు నెలలు దాటినప్పటికీ ఈ పథకంపై కనీసం ఎటువంటి ప్రకటన చేయడం లేదు. ప్రభుత్వం తక్షణమే స్పందించాలి.

– రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు, పార్వతీపురం మన్యం

గత ప్రభుత్వంలో క్రమం తప్పకుండా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఫీజ్ రీయింబర్స్‌మెంట్, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాల కింద ప్రభుత్వమే ఫీజులు చెల్లించేది. పిల్లల చదువుల భారం తల్లిదండ్రులపై పడకుండా చూసేది. సకాలంలో నిధులు విడుదల చేయడంతో విద్యార్థుల చదువులు సాఫీగా సాగాయి.

యువత నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి



నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

పార్వతీపురంటౌన్: యువత తమకు ఆసక్తి ఉన్న రంగంలో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. పట్టణంలోని ఎస్‌వీడీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల నుంచి 578 మంది అభ్యర్థులు జాబ్‌మేళాకు హాజరైనట్లు చెప్పారు. అందులో 85 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు స్కిల్ కాలేజీలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికృష్ణ చైతన్య, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.